క్లుప్తంగా

ప్రశంసాపత్రం అందుకున్న శ్యామల



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల రాష్ట్రస్థాయి కమాండేషన్ ప్రశంసా పత్రాన్ని నంచర్ల గురుకుల మ్యూజిక్ టీచర్ శ్యామల అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో అవార్డును గురుకుల సొసైటీ కార్యదర్శి నవీన్‌నికోలస్, అడిషనల్ కార్యదర్శి హనుమంతునాయక్ అందజేశారు. ఏఐవైఎఫ్ నాయకులు సురేష్, ప్రజా సంఘాల నాయకులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. గురుకుల సొసైటీ రిజినల్ కో ఆర్డినేటర్ ఫ్లారెన్స్ రాణీ, ప్రిన్సిపాల్ వెంకటమ్మపాల్గొన్నారు.

కవయిత్రికి సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: యాదాద్రిలో కలం స్నేహం సామాజిక సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాకులు గోపాల్ ఆచార్య ఆధ్వర్యంలో ఇటీవల శతాధిక మహిళా కవితోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన ప్రముఖ కవయిత్రి, తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజను ఘనంగా సన్మానించారు.

ఏఐటీయూసీది ఉద్యమ చరిత్ర

పాలమూరు: కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ వారధిగా పని చేస్తోందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర సహాయ కార్యదర్శి సురేష్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. చెన్నయ్య, నరసింహ, బుచ్చన్న, దేవానంద్, గోపాల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

జడ్చర్ల: బాదేపల్లి గంజ్‌లోని ఎస్‌బీఐ శాఖలో వ్యాపారులకు ప్రత్యేకంగా కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్ ద్వార వ్యాపారులు నగదు లావాదేవీలతో ఇతర సేవలు పొందవచ్చని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ నర్సింగ్‌నాయక్ తెలిపారు. సాధారణ కౌంటర్‌లో ఇతర వినియోగదారులు తమ సేవలను పొందాలని, వ్యాపారులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం వలన బ్యాంకులో సత్వరమే సేవలు లభించే అవకాశం ఏర్పడిందన్నారు.కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



హన్వాడ: త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలను ప్రజలు సజావుగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ రవినాయక్ సూచించారు. ఈమేరకు మంగళవారం మండల పరిధిలోని చిన్నదర్పల్లి, హన్వాడ, వేపూర్ గ్రామాల్లో పారామిలటరీ బలగాలతో ప్రధానరహదారిపై కవాతు నిర్వహించారు. ప్రజలు ప్రలోభాలకు గురు కాకుండా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల్లో భయాందోళనలు తొలగించేందుకే బలగాలతో కవాతు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.
దేవరకద్ర: మండలంలోని నాగారం, పెద్దరాజమూర్ గ్రామాల పరిసరాలలో మంగళవారం కేంద్ర బలగాలు, ఏఆర్ పోలీసు అధికారులు రూట్ మార్చ్ చేసి ఏరియా పరిశీలన చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

భూత్పూర్: మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో మంగళవారం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రతేక బలగాల సహకారంతో తనిఖీలు చేస్తున్నారు. రూ. 50వేలకు పైగా ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్లరాదన్నారు.



ఘనంగా ఐక్యతా దినోత్సవం



పీయూ ఆధ్వర్యంలో ఐక్యతా దినోత్సవం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 'రాష్ట్రీయ ఏక్తా దివస్'ను పాటించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో ఏఎంసీ పవన్‌కుమార్ ప్రతిజ్ఞ చేయించారు.

జడ్చర్ల: నవ భారత నిర్మాత సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ అని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం బాదేపల్లి ఎస్‌వీపీ నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
నవాబుపేట: ఎంపీడీఓ కార్యాలయంలో వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. ఎంపీపీ అనంతయ్య, ఎంపీడీఓ శ్రీలత, ఏపీఓ జ్యోతి, రమాదేవి, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.
గండేడ్: మండలపరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో వెన్నాచేడ్ సర్పంచ్ పుల్లారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సర్దార్ పటేల్ సేవలు మరువలేనివి అని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ గంగాధర్, రాజేశ్వరీ, శ్రీనివాసులు, స్వాతతి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.
పీయూలో..
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. కోఆర్డినేటర్ ప్రవీణ, అర్జున్, రవికుమార్, గాలెన్న, /జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.
పాలమూరు: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా బీజేపీ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, అంజయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వెన్నాచేడ్‌లో జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో



జిల్లా కేంద్రంలో..

విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



చిన్నచింతకుంట: అప్పంపల్లిలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠకు మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మన్నెంగౌడ్, అశోక్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రాధకృష్ణరెడ్డి, వేముల రాజరెడ్డి, అనంతరెడ్డిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

జేసీబీ, ట్రాక్టర్ స్వాధీనం



రాజాపూర్: మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి శివారులో గల దుందుభీ వాగులో మంగళవారం అక్రమంగా మట్టితీసి కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్న వారికి చెందిన ఒక జేసీబీని, మరో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌ఐ ఖదీర్ పేర్కొన్నారు. మండలంలో అక్రమంగా ఇసుకను తీయడంతో పాటు ఫిల్టర్‌లు ఏర్పాటు చేసి కృత్రిమ ఇసుకను తయారు చేసినట్లు తమ దృష్టికి వస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్, జేసీబీని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన వివరించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



సామగ్రి వద్ద అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల నిబంధనలు రాజకీయా పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు పాటించాలని నయాబ్ తహసీల్దార్లు రాజ్‌గోపాల్, సునీల్ అన్నారు. మంగళవారం వచ్చిన ఎన్నికల సామగ్రిని స్థానిక అర్బన్ కార్యాలయంలో భద్రపరిచారు. ఆర్ నర్సింగ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు.

బారికేడ్ల ఏర్పాటుకు చర్యలు



పరిశీలిస్తున్న డీఎస్పీ రమణారెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ నెల 3 నుంచి నామినేషన్లు వేయడానికి కావలసిన ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ రమణారెడ్డి, నోడల్ అధికారి రవీందర్‌నాథ్, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎస్‌ఐ వెంకటేశ్‌లు తహసీల్దార్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే బారికేడ్లను ఏర్పాటు చేసే విషయంపై చర్చించారు. నామినేషన్ కేంద్రంలోకి ఎవరూ ప్రవేశించకుండా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ: గడిచిన పదేళ్లల్లో బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరాయని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తపేట, వెంకటమ్మ కుంటతండా, దాచక్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. నాయకులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ఎంపీటీసీ అరుణ్, సర్పంచ్ చెన్నమ్మ, అంజిలయ్య పాల్గొన్నారు.
హన్వాడ: మున్సిపాలిటీ పరిధిలోని చిన్నదర్పల్లిలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం ఆయన చిన్నదర్పల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.
జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫాం హౌస్‌లో 37వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులు, మన్యంకొండ ఆటో యూనియన్‌కు చెందిన పలువురు నాయకులు, హన్వాడకు చెందిన పలువురు, ముదిరాజ్ సంఘం నాయకులు, వీహెచ్‌పీ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు.

ప్రాంతీయ పార్టీలతోనే అభివృద్ధి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

జడ్చర్ల: రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానికంగా మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అధికారంలోకి రాగానే సౌభాగ్యలక్ష్మి, కేసీఆర్ బీమా తదితర పథకాలను అమలు చేస్తామన్నారు. జడ్చర్లకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేయడంతో పాటు పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేస్తామన్నారు.
కాంగ్రెస్ టికెట్లను అమ్ముకుంది
కాంగ్రెస్ పార్టీ టికెట్లను అమ్ముకోవడం కారణంగానే తాను బీఆర్ఎస్‌లో చేరానని మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ తెలిపారు. కేసీఆర్‌తోనే సంక్షేమం సాధ్యమని తెలిపారు. అనంతరం ఆయన అనుచరులు బీఆర్ఎస్‌లో చేరాఉ. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
బాలానగర్: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మంగళవారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ప్రచారంలో దూసుకుపోవాలన్నారు. జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ కల్యాణి, వైస్ ఎంపీపీ వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయం ఖాయం



అప్పాయిపల్లిలో ప్రచారం

మహబూబ్‌నగర్ రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లావొద్దీన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో సర్పంచ్ ఊషన్న ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ అధ్యక్షురాలు వెంకటమ్మ, నాయకులు రాఘవేందర్‌గౌడ్, నాగయ్య, నజీర్, భగవంత్‌గౌడ్, సత్యనారాయణ, భర్తన్‌గౌడ్, అంజనేయులు, బాలకిష్టయ్య, సూరి, శశికుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ ఆధ్వర్యంలో కారు గుర్తుకు ఓట్లేసి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని గెలించాలని ఓటర్లను కోరారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని జెడ్పీటీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, కొండయ్య, శివరాములు, ప్రకాష్‌రెడ్డి, రఘురాములు, జమీర్, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఫీల్డ్ విజిట్

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం జడ్చర్లలోని బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఫీల్డ్ విజిట్‌కు హాజరైనట్లు ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. ఫీల్డ్ విజిట్ వల్ల ఉన్నత విద్యపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.



మధ్యాహ్న భోజనం పరిశీలన

నవాబుపేట: మండల పరిధిలోని కారుకొండ, లింగంపల్లి, కూచూర్ జెడ్పీ పాఠశాలలను ఎంఈఓ రాజునాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధన తీరు, కేజీబీవీలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. సిలబస్ ప్రకారం బోధించాలని, సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అధ్యక్షుడిగా శేఖర్

హన్వాడ: మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ కార్యాలయం నుంచి మంగళవారం నియామక పత్రం అందుకున్న శేఖర్.. మధుసూదన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థిగా బాలవర్ధన్‌గౌడ్

జడ్చర్ల టౌన్:ఎన్నికల్లో జడ్చర్ల అసెంబ్లీ అభ్యర్థిగా ఫార్వర్డ్‌బ్లాక్ నుంచి పోటీ చేస్తున్నట్లు ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ తెలియజేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ నినాదంతో పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

ప్రాజెక్టులు సృజనాత్మకంగా ఉండాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జి/క్లాస కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మంచి ప్రాజెక్టులు తీసుకోవాలని ఆయన సూచించారు. 45 రోజుల లోపల సృజనాత్మకంగా, వినూత్నంగా ఉండే ప్రాజెక్టులను తీసుకోవాలని, అధ్యాపకులు సూచించిన అంశాలను పాటించాలన్నారు. రీసోర్స్ పర్సన్ సత్యనారాయణగౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో పేదరిక నిర్మూలన ధ్యేయంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్‌ల, కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అదే విధంగా సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, సీనియర్ నేత చంద్రకుమార్‌గౌడ్, జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.
గండేడ్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీసేవలు చిరస్మరణీయం అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, లీగల్ సెల్ అడ్వైజర్ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోలాటంపై చిన్నారులకు శిక్షణ



కొత్తూర్‌లో కోలాటం వేస్తున్న చిన్నారులు

మిడ్జిల్: రోజురోజుకు జానపద కళలు అంతరించి పోతున్న నేపథ్యంలో మండల పరిధిలోని కొత్తూర్ గ్రామంలో చిన్నారులకు మొత్తం 21కోలలపై రాత్రి వేళల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు మూడు కోలలపై శిక్షణ పూర్తి అయినట్లు ప్రభాకరాచారి తెలిపారు. అదేవిధంగా వీధి నాటకాలపైనా తర్ఫీదు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచితంగా శిక్షణ ఇస్తున్న ప్రభాకరాచారిని ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు.

స్థానికుడిని.. అవకాశమివ్వండి



మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: 'మీ బిడ్డను.. స్థానికుడిని..ఒక్క అవకాశమిచ్చి చూడండి' అని కాంగ్రెస్ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి నరహరి ఆధ్వర్యంలో 100 మందికి పైగా ఆ పార్టీ కార్యకర్తలు అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు నరహరి సొంతగూటికి రావడం, సీనియర్ బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిన బీఆర్ఎస్ కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ చేసిందన్నారు. మండలకేంద్రంలో ఒక్క డబుల్‌బెడ్‌రూం కూడా ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. జడ్చర్లకు బీఆర్ఎస్ చేసింది శూన్యమన్నారు. మిడ్జిల్ మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.
బాలానగర్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సకల జనుల సంక్షేమం సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు



కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్ఎస్ కౌన్సిలర్లు మంగళవారం కొల్లాపూర్‌లో జరిగిన ప్రజాగర్జన సభలో మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు, కౌన్సిలర్ ఆనంద్‌గౌడ్, చిన్నదర్పల్లి కౌన్సిలర్ లతా తదితర కార్యకర్తలకు సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావులు కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.
కోయిల్‌కొండ: ఎమ్మెల్యే అభ్యర్థి పర్ణికారెడ్డి గెలుపు ఖాయమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయం సాధించి తీరుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. నాయకులు రాజునాయక్, విద్యాసాగర్, రవీందర్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.
హన్వాడ: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ శ్రీనువాసులు, బొక్కిరాములు, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.
చిన్నచింతకుంట: పార్టీ గెలుపునకు కృషి చేయాలని అమ్మపూర్ సంస్థానాధీశులు రాజ శ్రీరాంభూపాల్‌ను మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల అధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి కోరారు. మంగళవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మాజీ సర్పంచు దామోదర్, నాయకులు పార్టీలో చేరారు.

నిరుద్యోగులు కంటతడి పెడుతున్నారు



గాధిర్యాల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

మహమ్మదాబాద్: గ్రామాల్లో కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప మరేమీ కనబడటం లేదని మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గాధిర్యాల్, ఆముదాలగడ్డ తండాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ చేస్తున్నవన్నీ మోసపూరిత వాగ్దానాలే అని అన్నారు. ఎక్కడ చూసినా నిరుద్యోగులు కంటతడి పెడుతున్న ఘటనలు ఉన్నాయని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన



హస్తకళా ప్రదర్శనలో కొనుగోలు చేస్తున్న మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తున్నట్లు నిర్వాహకులు సంజయ్‌జైన్, నరేశ్ తెలిపారు. మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చేనేత కార్మికులు తయారుచేసిన వివిధ రకాల చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మేళా ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, అన్ని రకాల డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ప్రదర్శన నవంబర్ 11 వరకు అందుబాటులో ఉంటుందని వారు తెలిపారు.